సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం । 7 । జూలై । 2023



ఇద్దరి దుర్మరణం

ఎస్.కోటమండలం సంతగవిరమ్మపేట జంక్షన్‌వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా, ఐదుగురు గాయపడ్డారు.

- 8లో

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి



సీతానగరం: సువర్ణముఖి నదీ తీరాన వెలసిన లక్ష్మీ నృసింహస్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు స్వామివారికి పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రహదారిపై ఏనుగులు ప్రత్యక్షం

గరుగుబిల్లి: గత వారం రోజులుగా నందివానివలస, సంతోషపురం, పిట్టలమెట్ట తదితర గ్రామాల్లో సంచరించిన ఏనుగుల గుంపు మండలంలోని గొట్టివలస, గొల్లవానివలస గ్రామాల మధ్య ప్రధాన రోడ్డుపై గురువారం ప్రత్యక్షమయ్యాయి. ఏనుగులను చూసేందుకు ప్రజలు గుంపులు, గుంపులుగా తరలివచ్చారు. ఏనుగుల నుంచి రక్షణ కల్పించాలని అటవీశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఏనుగులను కవ్వించవద్దంటూ అటవీ శాఖాధికారులు ప్రజలకు సూచించారు.

న్యూస్‌రీల్

త్వరితగతిన భవనాల నిర్మాణం



రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనామారి

పాలకొండ: గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన భవనాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఆదేశించారు. పాలకొండ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పర్యటించారు. ముందుగా సింగన్నవలస గ్రామంలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యతాలోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. బుక్కూరు గ్రామంలో జగనన్నకాలనీని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో పర్యటించారు. ఇటీవల ఈ కాలనీలో డెంగీ కేసులు నమోదు కావడంతో అక్కడ పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలు అందించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.

కమిషనర్‌కు సీఆర్టీ పోస్టుల భర్తీ నివేదిక

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీ (కాంట్రాక్టు రెసిడెంట్ టీచర్) పోస్టులపై గిరిజన సంక్షేమశాఖ రాష్ట్ర కమిషనర్‌కు నివేదిక పంపించినట్టు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 269 పోస్టులకు గాను 215 మందికి బదిలీల కౌన్సెలింగ్ ఇటీవల నిర్వహించామన్నారు. వీరిలో ఎస్‌జీటీలు 54 మందికి వివిధ కారణాలతో నిలిపివేసినట్టు వెల్లడించారు. 39 మందికి టెట్ వంటి అర్హతలు లేవన్నారు. 15 మందికి మాత్రమే అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. క్వాలిఫైడ్ అభ్యర్థులతో సీఆర్టీల భర్తీకి అనుమతి కోరుతూ ఐటీడీఏ పీఓ సూచనలమేరకు కమిషనర్‌కు నివేదించామన్నారు.

సజావుగా ఇంటర్మీడియట్ రెండో విడత కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏటీడబ్ల్యూఓ, ప్రిన్సిపాళ్లు

సీతంపేట: గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో గిరిజన విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు సీతంపేట ఏపీటీడబ్ల్యూఆర్ బాలుర కళాశాలలో గురువారం నిర్వహించిన రెండో విడత కౌన్సెలింగ్ సజావుగా జరిగింది. బాలికల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, ఎల్‌అండ్‌టీ గ్రూపుల్లో 40 సీట్లకు 40 భర్తీ అయ్యాయి. ఆర్‌జేసీ బాలుర కళాశాలలో 30 సీట్లకు ఎంపీసీ 9, బైపీసీ 3, హెచ్‌ఈసీ 9 ఖాళీ ఉన్నాయి. పెద్దమడి కళాశాలలో ఎంపీసీ 13, బైపీసీ 10, సీఈసీ 7 సీట్లు భర్తీ కావాల్సి ఉంది. కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఓ మంగవేణి, గురుకుల సెల్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాళ్లు పైడి నాగభూషణరావు, సూర్యకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.


వ్యాధులపై అవగాహన అవసరం



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి శ్రీనివాసరావు

పార్వతీపురం టౌన్: జంతువుల నుంచి మానవులకు సంక్రమించే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. జూనోసిస్ డే సందర్భంగా స్థానిక పశువైద్యశాలలో గురువారం పెంపుడు జంతువులకు ర్యాబిస్ నిరోధక టీకాలు వేశారు. కుక్కలతో సన్నిహితంగా ఉండే వారికి ర్యాబిస్ హైటాటిసోసిస్, దొమ్మ వ్యాధి, డైరీ ఫారాలలో పనిచేసే వారికి బ్లూ సెల్లోసిస్, కోళ్ల ఫారంలో పనిచేసే వారికి సిట్టకోసిస్ లాంటి వ్యాధులు సోకే అవకాశం ఉందని, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి బోగి చక్రధర్, సిబ్బంది పాల్గొన్నారు.

పెరిగిన వంశధార



వంశధార నదిలో నీటి ప్రవాహం

భామిని: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. వంశధార నదీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో నదిలో నీటిప్రవాహం పెరిగింది. ఒడిశా–ఆంధ్రా మధ్య పలు గ్రామాల ప్రజలు నదిగుండా సాగించే రాకపోకలకు బ్రేక్‌పడింది.

ఉద్యోగ విద్య



- ఉద్యోగ, ఉపాధి కల్పించేలా సరికొత్త డిగ్రీ కోర్సులు
- ఈ ఏడాది నుంచి నాలుగేళ్ల డిగ్రీ కోర్సు
- కోర్సు ఉపయోగాలు వివరిస్తున్న అధ్యాపకులు
- పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నూతన సిలబస్
- జిల్లాలోని 6 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కోర్సుల నిర్వహణ
- జిల్లాలో 5 వేలమంది విద్యార్థులకు ప్రయోజనం



పార్వతీపురం శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పార్వతీపురంటౌన్:

చదువు పూర్తికాగానే ఉద్యోగం వస్తే.. ఆ ఆనందమే వేరు. చదువుకు సార్థకత చేకూరుతుంది. చిన్నవయసులోనే ఉద్యోగంలో చేరడం వల్ల నైపుణ్యాలను మెరుగుపరుచుకుని ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు అవకాశం కలుగుతుంది. కుటుంబం కూడా ఆర్థికంగా స్థిరపడుతుంది. అదే ఉద్దేశంతో ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. నూతన విద్యా సంస్కరణలు అమలు చేస్తోంది. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా విద్యాప్రణాళికను అమలుచేస్తోంది. తాజాగా.. డిగ్రీ విద్యలో ఉద్యోగం, ఉపాధి కల్పించే కోర్సులను అందుబాటులోకి తెచ్చింది. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) సూచన మేరకు కళాశాలలు నాలుగేళ్ల డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టాయి. ఈ విద్యా సంవత్సరం నుంచే డిగ్రీ ఆనర్స్, ఆనర్స్ విత్ రీసెర్చ్ డిగ్రీ కోర్సులను ప్రారంభించనున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో మొత్తం 6 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. ఉన్నత విద్యామండలి మార్గదర్శకాల ప్రకారం వసతులు ఉన్న కాలేజీల్లో నాలుగేళ్ల డిగ్రీ కోర్సును ప్రవేశపెట్టనున్నారు. దీంతో జిల్లాలో 5 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం కోసం పార్వతీపురం మన్యం జిల్లాలో అధ్యాపకులు సదస్సులు నిర్వహిస్తున్నారు. నూతన డిగ్రీ కోర్సుల అభ్యసనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. కోర్సు పూర్తిచేస్తే దేశంలో ఎక్కడైనా ఉన్నత విద్య అభ్యసించవచ్చని, విదేశాల్లో సైతం ఉపాధి అవకాశాలు సులభంగా లభిస్తాయని డిగ్రీ అధ్యాపకులు విడమర్చిచెబుతున్నారు. దీంతో యూజీ ఆనర్స్ కోర్సులపై విద్యార్థులకు ఆసక్తిపెరుగుతోంది.



కొత్త కోర్సులు ఇలా..

బీఏ ఆనర్స్:
హిస్టరీ, టూరిజం మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, స్పెషల్ ఇంగ్లిష్, స్పెషల్ తెలుగు, ఒక మేజర్ సబ్జెక్టుగా ఉంటాయి. మైనర్ సబ్జెక్టులుగా సోషియాలజీ, ఫిలాసఫీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సైకాలజీ ఉంటాయి.

బీఎస్సీ ఆనర్స్:
కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్, నానో టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, మ్యాథ్‌మెటిక్స్, స్టాటిస్టిక్స్, బోటనీ, హార్టికల్చర్, జువాలజీ, అగ్రికల్చర్, మైక్రో బయాలజీ, బయోకెమిస్ట్రీ మేజర్ సబ్జెక్టులుగా ఉంటాయి. మైనర్ సబ్జెక్టులుగా ఫుడ్ టెక్నాలజీతో పాటు ఎంపిక చేసుకున్న కోర్సుకు ఆధారంగా మరికొన్ని సబ్జెక్టులుగా ఉంటాయి.

బీకాం ఆనర్స్:
బీకాం జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్, బీబీఏ డిజిటల్ మార్కెంటింగ్, బ్యాంకింగ్ ఇన్సూరెన్స్, ఫైనాన్సియల్ సర్వీసెస్, అకౌంట్స్‌డ్ ట్యాక్సెస్ మేజర్ సబ్జెక్టులుగా ఉంటాయి.

డిగ్రీతోపాటు బీఈడీ
నూతన విద్యావిధానంలో బీఈడీ కోర్సు డిజైన్ చేశారు. దీంతో ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉపాధ్యాయ విద్య అందుతుంది. కెనడా, న్యూజిలాండ్, అమెరికా దేశాల్లో అధ్యయనం చేసి ఈ కోర్సు అమల్లోకి తెచ్చారు. డిగ్రీ మూడేళ్లు, బీఎడ్ రెండేళ్లు చదవాల్సిన అవసరం లేకుండా కేవలం నాలుగేళ్లలోనే మొత్తం కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హత ఉంటుంది.

యూజీ ఆనర్స్:
మొదటి సంవత్సరం పూర్తి చేస్తే సర్టిఫికెట్ ఇస్తారు. రెండో ఏడాది పూర్తి చేసిన వారికి డిప్లొమో వస్తుంది. మూడేళ్లు పూర్తిచేస్తే డిగ్రీ, నాలుగో ఏడాది ఉత్తీర్ణులైతే ఆనర్స్ పట్టా పొందుతారు. నాలుగేళ్లు ఆనర్స్ పూర్తి చేసిన తరువాత పీజీ ఏడాది చదివితే నేరుగా పీహెచ్‌డీ చేసే అవకాశం ఉంటుంది.

ఇవీ మార్పులు
పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నూతన సిలబస్ ప్రవేశ పెట్టారు. కళాశాల నుంచి కొలువులు దక్కేలా ప్రత్యేక నైపుణ్యాలపై దృష్టి పెట్టేలా అవకాశాలు కల్పించారు. ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేశారు. బీటెక్ కోర్సుకు దీటుగా డిగ్రీ సిలబస్ రూపకల్పన చేశారు.

విద్యార్థులకు చాలా ఉపయోగం



నాలుగేళ్ల యూజీ కోర్సు పూర్తిచేస్తే దేశంలో ఎక్కడైనా ఉపాధి అవకాశాలుంటాయి. నాలుగేళ్లు చదివితే డిగ్రీతోపాటు పీజీ మొదటి సంవత్సరం చేసినట్లు సర్టిఫికెట్ వస్తుంది. తరువాత పీహెచ్‌డీ చేసుకోవచ్చు. డిగ్రీలో అయితే మూడేళ్లు పూర్తిచేసి నాలుగో ఏడాది బీఈడీ చదువుకోవచ్చు.

– డా.చింతల చలపతిరావు, డిగ్రీ కళాశాలల నోడల్ కళాశాలల ప్రిన్సిపల్

భవన నిర్మాణాల పూర్తికి చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం: జిల్లాలో ప్రభుత్వ భవన నిర్మాణాలను పూర్తిచేసి ఆయా శాఖలకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్.జవహర్‌రెడ్డి కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. భూముల రీసర్వే, ఉపాధి హామీ పథకం, జగనన్న పాలవెల్లువ, పీఎం కిశాన్ ఈకేవైసీ, ఆధార్ సీడింగ్, స్పందన, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష, భూసేకరణ, కౌలురైతులకు గుర్తింపు కార్డుల పంపిణీ, గొడౌన్లు నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా నిశాంత్ కుమార్ మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తయిన సచివాయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లను అప్పగిస్తున్నామన్నారు. వీసీలో జేసీ ఆర్.గోవిందరావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు, పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు ప్రగతి బాటలు

- ఒప్పంగి గ్రామ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి భూమిపూజ
- రూ.కోటి50లక్షలతో రోడ్డు పనులు



పాడి-ఒప్పంగి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రగతి'బాటలు' వేస్తోందని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. కురుపాం మండలంలోని పాడి పంచాయతీ నుంచి ఒప్పంగి గిరిజన గ్రామానికి జాతీయ ఉపాధి హామీ నిధులు రూ.కోటి 50 లక్షల వ్యయంతో నిర్మించనున్న 2 కిలోమీటర్ల బీటీ రోడ్డు పనులకు గురువారం భూమి పూజచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. సంక్షేమ పథకాలను నేరుగా గిరిజన లబ్ధిదారుల ఖాతాలకు జమచేసి ఆర్థికోన్నతికి పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లి సుజాత, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, స్టేట్‌ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆనిమి ఇందిరాకుమారి, పాడి పంచాయతీ సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెవిలో పువ్వులు పెట్టొద్దు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- చంద్రబాబుకు డిప్యూటీ సీఎం రాజన్నదొర చురకలు
- 14 ఏళ్ల సీఎంగా ప్రజలకు చేసిన మేలు ఏమిటో చెప్పాలి?
- అవినీతి రహితంగా ప్రజలకు ఒక్క రూపాయి ప్రయోజనం కల్పించారా?
- జన్మభూమి కమిటీలతో సాగించిన దందాను ప్రజలు మరచిపోలేదు
- డ్వాక్రా, రైతు రుణాలను ఎందుకు మాఫీ చేయలేదు?
- మీ అబద్ధపు హామీలను నమ్మేస్థితిలో ప్రజలు లేరు

సాలూరు:

ముఖ్యమంత్రిగా 14 ఏళ్ల పాటు పనిచేశారు.. అవినీతి రహితంగా ఒక్క పథకమైనా ప్రజలకు మంజూరు చేశారా?.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలన ఆలోచన మీకు ఎందుకు రాలేదు..? పేద కుటుంబాల పిల్లల చదువుకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న అమ్మఒడి లాంటి బృహత్తర పథకం ఎందుకు అమలు చేయలేకపోయారు? డ్వాక్రా, రైతు రుణాలు మాఫీ చేస్తామని చెప్పి ఎందుకు చేయలేదు? జన్మభూమి కమిటీలతో దందా సాగించారే తప్ప ఏనాడైనా పారదర్శకంగా, అర్హులకు ఒక్క సంక్షేమ పథకమైనా అందజేశారా?.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజల చెవిలో పువ్వులు పెట్టేలా.. మీరు ఇస్తున్న అబద్ధపు హామీలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర మాజీ సీఎం చంద్రబాబుకు చురకలంటించారు. కుల,మత, రాజకీయాలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని పేర్కొన్నారు. సాలూరులో గురువారం నిర్వహించిన అమ్మఒడి నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలుచేశారన్నారు. నవరత్నాలతో ప్రజల ఆర్థికోన్నతికి, వికాసానికి పాటుపడుతున్నారని తెలిపారు. డ్వాక్రా, రైతు రుణాలు మాఫీ చేయకుండా, నేడు నెలకు రూ.15వేల కోట్లు, ఏడాదికి లక్షా 80 వేల కోట్లను మహిళలకు లబ్ధికల్పిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో నేరుగా డీబీటీ పద్ధతిలో 2లక్షల 20 వేల కోట్ల రూపాయలను వివిధ పథకాల కింద అర్హుల ఖాతాలకు జమచేశారని తెలిపారు. 3 లక్షల కోట్ల రూపాయలు విలువైన అభివృద్ధి పనులు చేశారన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు.

ఆపద్బంధువులా ఆదుకుంటున్న 108



ఉమ్మడి విజయనగరం జిల్లాకు కొత్తగా ప్రభుత్వం మంజూరు చేసిన108 అంబులెన్సులు

- ప్రజారోగ్యానికి జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు అధిక ప్రాధాన్యం
- ఉమ్మడి విజయనగరం జిల్లాకు కొత్తగా 108 అంబులెన్సులు 13 మంజూరు
- మరమ్మతులకు గురైన వాటి స్థానంలో వినియోగం
- 14 నెలల్లో 61,411 మందికి సేవలు
- వీటిలో అత్యధికంగా సేవలు పొందిన 15,902 మంది గర్భిణులు
- ఫోన్ చేసిన క్షణాల్లో వస్తున్న వాహనం
- ప్రాణాలు నిలుపుతున్న వాహన సేవలు

విజయనగరం ఫోర్ట్: ప్రజారోగ్యానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. నాడు–నేడు కింద ఆస్పత్రులకు ఆధునిక సొబగులు అద్దింది. వైద్యులు, సిబ్బంది నియామకాలతో పాటు ఆధునిక వైద్యపరికరాలు సమకూర్చింది. డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి ఖరీదైన వైద్యాన్ని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రుల్లో ఉచితంగా అందిస్తోంది. చికిత్సానంతరం ఆరోగ్య ఆసరా కింద భృతిని చెల్లిస్తోంది. జిల్లా ప్రజలకు అన్ని రకాల స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ వైద్య కళాశాలను యుద్ధప్రాతిపదికన నిర్మిస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా పల్లెముంగిట వైద్యసేవలు అందిస్తోంది. ఆపదవేళ ఆదుకుంటున్న 108 వాహన సేవలకు పెద్దపీట వేస్తోంది. మరమ్మతులకు గురైన అంబులెన్స్‌ల స్థానంలో కొత్తగా ఉమ్మడివిజయనగరం జిల్లాకు 13 వాహనాలను సమకూర్చింది. అవి జిల్లాకు చేరుకోవడంతో ప్రజలు, వైద్య వర్గాలు సంతోషం వ్యక్తంచేస్తున్నాయి. ప్రజారోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను ప్రశంసిస్తున్నాయి.

కొత్తగా 13 అంబులెన్సులు
ఉమ్మడి విజయనగరం జిల్లాకు 13 కొత్త అంబులెన్సులు వచ్చాయి. వీటిలో విజయనగరం జిల్లాకు 11, పార్వతీపురం మన్యం జిల్లాకు 2 వచ్చాయి. పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి గరుగుబిల్లి, బలిజిపేట మండలాలకు కొత్త అంబులెన్సులు కేటాయించారు. విజయనగరం జిల్లాలోని విజయనగరం, వేపాడ, గంట్యాడ, డెంకాడ, చీపురుపల్లి, రేగిడిఆమదాలవలస, వంగర, రాజాం, బొబ్బిలి, బాడంగి, దత్తిరాజేరు, మెరకముడిదాం మండలాలకు కొత్త అంబులెన్సులు మంజూరు చేశారు.

108లో సౌకర్యాలు ఇలా..
108 అంబులెన్సులో రెండు ఆక్సిజన్ సిలిండర్లతో కూడిన సిస్టమ్ ఉంటుంది. మల్టీపారామీటర్ (బీపీ, పల్స్, ఆక్సిజన్ శాతం తెలుసుకోవడానికి ఉపయోగించేది), సుగర్ పరీక్ష చేసేందుకు గ్లూకోమీటర్, సిరంజ్ పంపు (మందు ఎంత మోతాదులో ఇవ్వాలో తెలియజేసేది), స్ట్రెచ్చర్, వీల్ చైర్, బీపీ ఆపరేటర్, వాల్యూమ్ ఇన్ఫ్యూజన్‌పంపు, మందులు వంటి సౌకర్యాలు అంబులెన్సులో ఉంటాయి.

నెలకు 4,500 మందికి అత్యవసర సేవలు
జిల్లాలో 108 అంబులెన్సులు 36 ఉన్నాయి. నెలకు 4,500 మందికి పైగా రోగులకు 108 సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారు, పాముకాటుకు గురైన వారు, అగ్ని ప్రమాదాల్లో గాయపడినవారు, గుండె జబ్బులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడేవారు, గర్భిణులు ఇలా... ఆపదసమయంలో ఉన్నవారందరికీ 108 సేవలు వరంగా మారాయి. 14 నెలల్లో 61,411 మంది సేవలు అందుకున్నారు.

కుయ్‌కుయ్‌మంటూ...
ప్రమాదం, ఆపదలో ఉన్నామన్న సమచారం అందిన వెంటనే 108 అంబులెన్సు కుయ్‌కుయ్ అంటూ ఘటన స్థలానికి చేరుకుంటున్నాయి. పట్టణ ప్రాంతాల్లో అయితే 15 నిమిషాల్లోను, పల్లె ప్రాంతాల్లో అయితే 20 నుంచి 25 నిమిషాల్లో 108 అంబులెన్సులు సంఘటన స్థలానికి చేరుకుంటున్నాయి. అందులోని సిబ్బంది ప్రాథమిక వైద్యసేవలు అందిస్తూ ఆస్పత్రికి చేర్చుతున్నారు.

క్షణాల్లో...



నా పేరు మూనూరు నాయుడు. మాది జామి మండలం రామయ్య పాలేం(దుంపల కొత్తూరు). కొద్ది రోజుల కిందట ఇంటి నుంచి బైక్‌పై పైడిభీమవరం డ్యూటీకి వెళ్తుండగా మా గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న బోలేరో వాహనం బలంగా ఢీకొట్టింది. కుడి కాలు ముడుకు విరిగిపోయింది. మా కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. క్షణాల్లో అంబులెన్సు వచ్చి విజయనగరంలోని ఆస్పత్రిలో చేర్చింది. ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా ఆపరేషన్ చేశారు. ఆరోగ్యం కుదుటపడింది.

రోగుల ప్రాణాలు కాపాడాలన్నదే లక్ష్యం



రోగుల ప్రాణాలు కాపాడాలన్న లక్ష్యంతో సేవలు అందిస్తున్నాం. 108 సిబ్బంది అంకిత భావంతో పనిచేస్తున్నారు. ఆపదలో ఉన్నవారిని సేవలతో ఆదుకుంటున్నారు. ప్రభుత్వం అధునాతన సదుపాయాలతో కూడిన కొత్త వాహనాలను సమకూర్చడం సంతోషదాయకం.

– ఎస్.మన్మథనాయుడు, 108 జిల్లా మేనేజర్

వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం



రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం ఎంత ఖర్చు అయినా వెనుకాడడం లేదు. 108 అంబులెన్సులు కొన్ని మండలాల్లో శిథిలావస్థకు చేరుకోవడంతో వాటి స్థానంలో అన్ని వసతులు కల్గిన 108 అంబులెన్సులను ప్రభుత్వం అందించింది.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ



108 అంబులెన్సు లోపలి భాగం

2022 జనవరి నుంచి 2023 ఫిబ్రవరి వరకు 108 అంబులెన్సులు అందించిన సేవలు

విభాగం	వైద్య సేవలు పొందిన వారి సంఖ్య
కడుపినొప్పి	2,708
శ్వాసకోసరోగులు	6,207
కోవిడ్ కేసులు	128
మధుమేహరోగులు	420
జ్వరాలు	2,720
పిట్స్	1489
గుండెజబ్బులు	6,280
ఇతరకేసులు	10,205
పురుగుమందులు తాగినవారు	1325
ఇతరులు	12,125
గర్భిణులు	15,902
రోడ్డు ప్రమాదాలకు గురైనవారు	4,603
పాముకాటు బాధితులు	1385
కోమాలో ఉన్నవారు	1864

క్లుప్తంగా

నేడు మైక్రో బయాలజీ ల్యాబ్ ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మైక్రో బయాలజీ ల్యాబ్

విజయనగరం ఫోర్ట్: సర్వజన ఆస్పత్రిలో మైక్రో బయాలజీ ఆస్పత్రిని శుక్రవారం ప్రారంభించనున్నారు. ఇప్పటికే దానికి సంబంధించిన పరికరాలు ఆస్పత్రికి చేరుకోగా వాటి అమరిక కూడా పూర్తయింది. బ్లడ్‌కలర్, యూరిన్ కలర్ పరీక్షలు మైక్రో బయాలజీ ల్యాబ్‌లో చేయనున్నామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

80 లీటర్ల సారా స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా, పట్టుబడిన వ్యక్తి

కొమరాడ: మండలంలోని కొత్తవలస గ్రామంలో వాహన తనిఖీలు చేపడుతుండగా సారాను ద్విచక్రవాహనంతో తరలిస్తున్న వ్యక్తి గురువారం పట్టుబడ్డాడని ఎస్సై జగదీష్ నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆ వ్యక్తి వద్ద ఉన్న 80 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు, కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

బైక్ దొంగల అరెస్ట్

- నాలుగు బైక్‌లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: బైక్‌ల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను, ఒక మైనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బైక్ చోరీకి గురైందని స్థానికుడైన లోకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో ప్రదీప్‌నగర్ జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న కొత్తూరు గ్రామానికి చెందిన ద్వారపు రెడ్డి సాయికృష్ణ, గురుగుబిల్లికి చెందిన కంజాడ సాయి, వంగర మండలాని చెందిన మైనర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. నేరాన్ని వారు అంగీకరించడంతో వారి నుంచి నాలుగు బైక్‌లను రికవరీ చేసి అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై పాపారావు

పార్వతీపురంటౌన్: పట్టణం, గ్రామాల్లో ప్రయాణికులకు సేవలందించే ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పార్వతీపురం ట్రాఫిక్ ఎస్సై పాపారావు అన్నారు. ఈ మేరకు స్థానిక బస్టాండ్ కూడలి వద్ద గురువారం ఆటోడ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినా, వారితో అమర్యాదగా ప్రవర్తించినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓవర్‌లోడ్ ఎక్కించరాదని ధనాపేక్షతో కాకుండా, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. వాహన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. లేకుంటే అపరాధ రుసుం విధిస్తామన్నారు. వివిధ మార్గాల్లో సంచరించే ఆటోల వివరాలను ఆయా స్టాండ్‌ల వద్ద ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అవగాహన సదస్సులో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడికి దేహశుద్ధి

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులోని పొనుగుటివలస జంక్షన్ వద్ద మద్యం మత్తులో ఓ యువకుడు వీరంగం సృష్టించాడు. గురువారం ఉదయం పూటుగా మద్యం తాగిన ఆ యువకుడు జంక్షన్ వద్ద బస్సు కోసం ఎదురుచూస్తున్న మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఇది గమనించి ప్రశ్నించిన స్థానికులపై దాడికి యత్నించగా, అక్కడి వారంతా కలిసి యువకుడికి దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు.

ఇద్దరి దుర్మరణం

- ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలు
- మరో ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలు
- ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం



గోగాడ సత్యం



ముసలయ్య



ప్రమాద దృశ్యం

శృంగవరపుకోట: అరగంటలో ఊరికి చేరుకుంటామనుకున్న ప్రయాణంలో ఊహించని కుదుపు. ఎదురుగా ట్రాక్టర్ మృత్యుశకటంలా దూసుకొచ్చి రోడ్డు పక్కన నిలిపిఉన్న ఆటోను ఢీకొట్టంతో ఆటో, ట్రాక్టర్ బోల్తా పడ్డాయి. ఏం జరిగిందో తేరుకుని చూసేలోగా రెండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఎస్.కోట మండలంలో సంతగవిరమ్మపేట జంక్షన్ వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు చనిపోగా ఇద్దరు మహిళలు తీవ్రగాయాలతో, మరో ముగ్గురు మహిళలు స్వల్ప గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం 12గంటల సమయంలో సుమారు 10మంది ప్రయాణికులతో ఎస్.కోట నుంచి ఆలుగుబిల్లికి ఆటోబయలుదేరింది. సంతగవిరమ్మపేట జంక్షన్‌కు చేరుకోగానే ప్రయాణికుడొకరు పశువులకు దాణా కొంటానని ఆటో నిలపాలని అడగడంతో డ్రైవర్ రోడ్డు పక్కన ఆటోను నిలిపాడు. ఆ వ్యక్తి దుకాణానికి వెళ్లగా మిగిలిన వారంతా ఆటోలోనే ఉన్నారు. అదే సమయంలో వచ్చిన ట్రాక్టర్ ఆటోను ఢీకొట్టడంతో సీతంపేట గ్రామానికి చెందిన ముంత ముసలయ్య(70), చుక్కవానిపాలెం గ్రామానికి చెందిన గోగాడ సత్యం(68) మృతిచెందారు. గాయాలపాలైన మహిళలను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

అయ్యో పాపం..!

- బాలికపై లైంగికదాడికి పాల్పడిన యువకుడు

పూసపాటిరేగ: అభం శుభం తెలియని చిన్నారిపై మానవ మృగం దాడి చేసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ అమానవీయ ఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న బాలిక మంగళవారం మధ్యాహ్నం భోజన విరామసమయంలో మూత్ర విసర్జనకు పాఠశాల వెనుక ఉన్న పొలంలోకి వెళ్లింది. అదే గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలుడు బాలిక ఒంటరిగా ఉండడం చూసి కొబ్బరికాయ ఇస్తానని ప్రలోభపెట్టి సమీపంలోని తోటలోకి తీసుకెళ్లాడు. చుట్టు పక్కల ఎవరూ లేకపోవడంతో బాలికను భయపెట్టి లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి పంపించేశాడు. లైంగిక దాడి వల్ల తీవ్ర రక్తస్రావం అవుతున్నప్పటికీ బాలిక ఇంటికి వెళ్లిపోయింది. తల్లి గమనించి అడగ్గా మూత్ర విసర్జనకు వెళ్లినప్పుడు కాలుజారిపడిపోవడంతో గాయమైందని భయపడుతూ చెప్పింది. దీంతో బాలికను స్థానిక ఆస్పత్రికి తల్లి తీసుకెళ్లగా తీవ్ర రక్తస్రావం కారణంగా పరిస్థితి విషమించిందని వైద్యులు తెలిపారు. అక్కడినుంచి విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లడంతో వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. విశాఖ వైద్యులు పరీక్ష నిర్వహించి బాలికపై లైంగికదాడి జరిగినట్లు ధ్రువీకరించారు. దీంతో దిశ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు గ్రామానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఎస్సై ఎ.నరేష్ పాఠశాలలో జరిగిన ఘటనపై గురువారం విచారణ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు, పాఠశాల సమీపంలో ఉన్న గ్రామస్తులను విచారణ చేసి జరిగిన సంఘటనపై కేసు నమోదు చేశారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే శంబంగి భరోసా
- స్వగ్రామానికి చేరుకున్న మృతదేహాలు



మృతదేహాన్ని చూసి విలపిస్తున్న కుటుంబ సభ్యులు



మృతులకుటుంబాలను పరామర్శించి ఓదారుస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో పాఠశాల ప్రహరీ తొలగిస్తుండగా శకలాలు మీద పడి బాడంగి మండలం వీరసాగరం వాసులు కొల్లిజగన్నాథం, సక్కేల సత్యం, రాపాక కన్నయ్య మృతిచెందిన సంగతి తెలిసిందే. వారి మృతదేహాలు గురువారం సాయంత్రం గ్రామానికి చేరుకున్నాయి. వాటిని చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. నెల రోజుల కింద ఆనందంగా వెళ్లిన వారు విగతజీవులుగా వచ్చారంటూ విలపించారు. వేర్వేరుగా అంతిమ సంస్కారాలు జరిపారు.

ఆదుకుంటాం..

మృతుల కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు భరోసా ఇచ్చారు. సర్పంచ్ మరిపి జయలక్ష్మి కుమారుడు వేణుగోపాలనాయుడు, నారాయణ మాస్టారు, ఎంపీటీసీ గొర్లెదాలమ్మలతో కలిసి గురువారం ఆయన మృతులకుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు. కోయంబత్తూరులో ఉండిపోయిన మృతదేహాలు స్వగ్రామానికి రప్పించేందుకు అక్కడి కలెక్టర్‌తో మన కలెక్టర్ మాట్లాడి త్వరితగతిన వచ్చేందుకు ప్రయత్నించామని చెప్పారు. మృతులు ముగ్గురికీ వైఎస్సార్ బీమా రూ.15లక్షలు వారి వారసులకు వచ్చేలా కృషిచేస్తానని ధైర్యం చెప్పారు. పరామర్శలో జెడ్పీటీసీ రామారావు, తెంటు మధుసూదనరావు, మరిపి శంకరరావు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



ఘటనా స్థలంలో పూతి మహేష్ మృతదేహం, ప్రమాదానికి కారణమైన లారీ

అక్కిరెడ్డిపాలెం: బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన యువకుడిని లారీ రూపంలో మృత్యువు కాటేసింది. గాజువాక కణితి రోడ్డు వై జంక్షన్ వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో యువకుడు సంఘటన స్థలంలోనే దుర్మరణం చెందాడు. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలివీ.. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంనకు చెందిన పూతి మహేష్(25) స్విగ్గీలో పని చేస్తున్నాడు. మహేష్ ద్విచక్ర వాహనంపై గాజువాక కణితి రోడ్డు వై జంక్షన్ వద్దకు రాగానే.. వెనుకనే వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని తలపై నుంచి లారీ వెళ్లిపోవడంతో.. మహేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న ఏసీపీ త్రినాథ్, ఎస్ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని.. ప్రమాదంపై ఆరా తీశారు. వివరాలు సేకరించి ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. లారీని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మహేష్ అవివాహితుడు. అతని తల్లిదండ్రులు వీరఘట్టంలోనే ఉంటున్నారని ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్ విగ్రహావిష్కరణ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: పార్వతీపురం ఆర్టీసీ కూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు గురువారం గాదెలవలస ప్రాథమిక పాఠశాల ఆవరణలో మండల స్థాయి వైఎస్సార్ సీపీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోట్లాదిమంది ప్రజల ఆరాధ్య దైవం, ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని పార్వతీపురంలో ఆర్టీసీ కూడలి వద్ద మహానేత జయంతి సందర్భంగా శనివారం ఆవిష్కరించనున్నట్లు తెలియజేశారు. ఈ విగ్రహాన్ని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావులు ఆవిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రతి గ్రామం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ సలహాకమిటీ జిల్లాచైర్మన్ వి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు,పలుగ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు,పీఏసీఎస్ చైర్మన్‌లు,రాజన్న అభిమానులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, కేఎస్ పురం మాజీ సర్పంచ్ ఉడమల కృష్ణమూర్తి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం సాయంత్రం ఆయనను పరామర్శించారు.

అన్నదమ్ముల గొడవలో ఒకరికి గాయాలు

పార్వతీపురం: అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో ఒకరికి గాయాలయ్యాయి. బుధవారం రాత్రి జరిగిన ఘటనపై గురువారం పార్వతీపురం అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం పట్టణంలోని బోటువారి వీధికి చెందిన కె.గణపతి, తమ్ముడు నాగరాజుల మధ్య అమ్మ రాజేశ్వరిని ఎవరి దగ్గర ఉంచాలనే విషయమై చర్చ జరిగింది. అన్నదమ్ముల్లో ఒకడైన నాగరాజు అంగీకరించలేదు. దీంతో ఇద్దరిమధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో నాగరాజు కత్తితో గణపతిపై దాడిచేయగా తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించారు.

కొట్లాటలో ఇద్దరికి..

సీతానగరం మండలం తామరఖండి గ్రామానికి చెందిన డోకుల అనిల్‌కుమార్, అదే గ్రామానికి చెందిన జి.బాలాజీ ఒకరినొకరు తీవ్రంగా గాయపరుచుకున్నారు. నా భార్యకు ఎందుకు ఫోన్ చేస్తున్నావంటూ అనిల్‌కుమార్‌తో బాలాజీ వాగ్వాదానికి దిగాడు. దీంతో ఇద్దరి మధ్య జరిగిన గొడవలో ఒకరినొకరు తీవ్రంగా గాయపరుచుకున్నారు. గాయాలపాలైన అనిల్‌కుమార్, బాలాజీలను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి స్థానికులు చికిత్సకోసం తరలించారు.

యువతి ఆత్మహత్య

పాలకొండ రూరల్/పాలకొండ టౌన్: పట్టణంలోని 12వ వార్డుకు చెందిన కందుల మానస(24) గురువారం మధ్యాహ్నం తన స్వగృహంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సురేష్, లక్ష్మి దంపతులు లోగిడి వీధిలో కిరాణా వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వారికి ముగ్గురు పిల్లలు. వారి రెండవ కుమార్తె మానస చిన్నతనం నుంచి బుద్ధిమాంద్యంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలతో అవస్థలు పడుతోంది. తాజాగా డిగ్రీ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మానసికంగా కుంగిపోగా బలహీనపడి కొద్ది రోజులుగా దిగులుగా ఉంటున్నట్లు తల్లితండ్రులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమ ఇంటి పైగదిలో ఆత్మహత్యకు పాల్పడిందని చెప్పారు. కుమార్తె ఆత్మహత్యను గుర్తించిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై బి.శివప్రసాద్ మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడతామని స్పష్టం చేశారు.

గడ్డిమందు తాగి మరో యువతి..



బోయిన సంగీత మృతదేహం

కురుపాం: మండల కేంద్రంలోని శోభలతాదేవి కాలనీకి చెందిన బోయన సంగీత (25) గురువారం సాయంత్రం ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కురుపాం ఎస్సై సీహెచ్.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు 9న ఎంపికలు



మాట్లాడుతున్న చెస్ అసోసియేషన్ కార్యవర్గం

బొబ్బిలి: వచ్చే నెల 11 నుంచి శ్రీకాకుళంలో మూడు రోజుల పాటు జరిగే అండర్-11 చెస్ రాష్ట్ర స్థాయి పోటీలకు సంబంధించిన సెలక్షన్స్ ఈనెల 9న నిర్వహిస్తున్నట్టు జిల్లా చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి మూడడ్ల గణేష్ నాయుడులు తెలిపారు. ఈ మేరకు గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు నిర్వహించే మొదటి రౌండ్‌తో ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. ఎంపికల్లో పాల్గొనే వారు జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9182337499 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దివ్యాంగ క్రికెటర్‌కు కిట్ వితరణ



గణేష్‌కు క్రికెట్‌కిట్‌ను అందజేస్తున్న జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 8తేదీ వరకు జరగబోయే జాతీయ దివ్యాంగుల టీ-20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లిమర్ల మండలం సతివాడకు చెందిన మజ్జి గణేష్‌కు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జెడ్పీ నిధుల నుంచి రూ. 46వేల విలువైన క్రికెట్ కిట్‌ను ప్రోత్సాహకంగా అందజేశారు. జెడ్పీ కార్యాలయంలో గురువారం జెడ్పీచైర్మన్‌ను మజ్జి గణేష్ మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా ఆయన గణేష్‌ను అభినందిస్తూ రాష్ట్రానికి, దేశానికి పేరు తేవాలని కోరారు. ఇదిలా ఉండగా దివ్యాంగుల టీ-20 టోర్నమెంట్‌లో మజ్జి గణేష్ ఆల్‌రౌండర్‌గా ఎంపికయ్యాడు. కార్యక్రమంలో జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈవో కె.రాజ్‌కుమార్, నెల్లిమర్ల జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, డీసీసీబీ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, రాష్ట్ర టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీను, నెల్లిమర్ల వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

8,9 తేదీల్లో బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక

- ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురాజు



ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజును జ్ఞాపికతో సత్కరిస్తున్న బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: 2023-24వ సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో జరగబోయే షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 8,9 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు వెల్లడించారు. ఈ మేరకు గురువారం స్థానిక డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ వివిధ వయస్సుల విభాగాల్లో త్వరలో జరగబోయే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనబోయే క్రీడాకారుల ఎంపిక పోటీలు తేదీలను ఖరారు చేసినట్లు తెలిపారు. ఈనెల 8వ తేదీన అండర్-17, అండర్-19 విభాగాల్లో బాల, బాలికలకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 9వ తేదీన పురుషులు, మహిళల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులు నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు.

డిసెంబర్‌లో వెటరన్స్ ఎంపిక

అలాగే అండర్-11,13,15 వయస్సుల విభాగాలకు ఆగస్టు నెలలో..వెటరన్స్ విభాగంలో డిసెంబర్‌లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని వివరించారు. ఎంపిక పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు విజయనగరం ఫోన్ నంబర్ -9133773485, ఎస్‌కోట క్రీడాకారులు -7789199534, బొబ్బిలి క్రీడాకారులు-7981111705 నంబర్, సాలూరు క్రీడాకారులు -9515729785 నంబర్, చీపురుపల్లి క్రీడాకారులు 9885830520 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్, అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ వీఎస్ ప్రసాద్, ఎంకేబీ శ్రీను, వై.కుసుంబచ్చన్, నున్న సురేష్, ప్రసాద్, పి.శ్రీరాములు, ఎస్.మల్లికార్జునరావు, ఎం.డి అబ్దుల్ హక్, ఎల్.శ్రీనివాసరావు, వీడీ గిరి, అపర్ణ బాబు, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'పనిష్మెంట్' చిత్ర గీతం విడుదల చేసిన కోలగట్ల



చిత్ర గీతాన్ని విడుదల చేస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అంకిత ఆర్ట్స్ పతాకంపై విజయనగరానికి చెందిన మన్యాల శ్రీనివాసరావు దర్శకత్వంలో రూపొందించిన 'పనిష్మెంట్ ' చిత్ర గీతాన్ని ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి గురువారం విడుదల చేశారు. తన నివాసం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో చిత్రబృందాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల అభినందించి సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ చిత్రానికి దర్శకత్వంతో పాటు కథ, స్క్రీన్ ప్లే, మాటలు మన్యాల శ్రీనివాసరావు అందించారు. సాంకేతిక, చిత్రబృందంలో అధిక శాతం మంది విజయనగరం వారేనని మన్యాల శ్రీనివాస రావు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో కో డైరెక్టర్ మన్యాల ఆకాష్, చిత్ర బృందం కిక్ శంకర్, ఎం.నవీన్ కుమార్, ఎం.విజయభాస్కర్, రాంబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడితో కలిసి భర్త హత్యకు కుట్ర

- హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ సీహెచ్. లక్ష్మణరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: వివాహేతర సంబంధం మోజులో ఉన్న భార్య కట్టుకున్న భర్తనే కడతేర్చాలని ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో భర్తకు బిర్యానీలో నిద్రమాత్రలు కలిపి పెట్టింది. దీంతో భర్త నిద్రలోకి వెళ్లిన తర్వాత వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తిని పిలిపించి నైలాన్‌తాడు మెడకు బిగించి హత్య చేసేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో భర్తకు తెలివివచ్చి కేకలు వేయడంతో అందరూ పారిపోయారు. బాధితుడు తేరుకుని టూటౌన్ పోలీసులకు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కుమ్మరివీధికి చెందిన కోటరాజు, భార్య శ్రీదేవి, పిల్లలు బుధవారం రాత్రి ఇంట్లో నిద్రకు ఉపక్రమించారు. శ్రీదేవికి చిన గోకవీధికి చెందిన గంధవరపు రఘుతో కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. ఈ సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను తప్పించాలనే ఉద్దేశంతో మట్టుబెట్టాలని ప్రణాళిక వేసింది. తన భర్తను చంపేయమని రఘుకు చెప్పింది. వెంటనే రఘు ఒక ఆర్ఎంపీ డాక్టర్ దగ్గర నుంచి నిద్రమాత్రలు కొని శ్రీదేవికి ఇచ్చాడు. అవి తీసుకుని శ్రీదేవి భర్త రాజుకు బుధవారం రాత్రి మటన్ బిర్యానీలో కలిపి తినిపించింది. రాజు నిద్రలోకి జారుకున్న తర్వాత రఘుకు ఫోన్ చేసి ఇంటికి రమ్మని పిలవగా వరుసకు బావమరిది అయిన బొగ్గులదిబ్బకు చెందిన కేత శ్రీను సహాయం కోరి రూ. 20వేలకు ఒప్పందం కుదుర్చుకుని ఇద్దరూ వచ్చారు. వారు తెచ్చుకున్న నైలాన్ తాడును రాజు మెడకు బిగించి హత్య చేసేందుకు ప్రయత్నించగా మెలకువ వచ్చిన రాజు పెద్దగా కేకలు వేయడంతో అక్కడి నుంచి ఇద్దరూ పారిపోయారు. ఈ మేరకు విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించడంతో రఘు, శ్రీను, శ్రీదేవిలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్సై షేక్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన గొడవ



రామినాయుడు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రాజాం సిటీ/రేగిడి: రాజాం వారపుసంతలో జరిగిన చిన్నపాటి ఘర్షణ ఓ వ్యక్తి ప్రాణాన్ని బలితీసుకుంది. ఇద్దరు వ్యక్తుల మధ్య దళారీ సొమ్ము విషయంలో చెలరేగిన గొడవను విడిపించేందుకు వెళ్లిన వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. ఈ ఘటనపై సీఐ రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజాంలో ప్రతి గురువారం జరిగే వారపు సంతకు పశువుల వ్యాపారం నిమిత్తం రేగిడి మండలంలోని అంబకండికి చెందిన మండల రామినాయుడు (రాము)(45), ఆయన బావ పప్పల శ్రీహరినాయుడు, సాకేటి లక్ష్మణ, మండల చక్రధరరావు ఎప్పటిలాగానే వచ్చారు. పదేళ్లుగా ఆవుల క్రయవిక్రయాలు చేస్తూ వచ్చే కొద్దిపాటి లాభంతో జీవనం సాగిస్తున్నారు. సాకేటి లక్ష్మణకు చెందిన ఆవును మండల చక్రధరరావు రూ.50 వేలకు జామి మండలంలోని అలమండ సంత ప్రాంతానికి చెందిన శ్రీనురాజుకు విక్రయించాడు. శ్రీనురాజు వెంటనే అదే సంత ప్రాంతానికి చెందిన జన్నెల ఈశ్వరరావుకు రూ.53 వేలకు ఆవును విక్రయించాడు. అందులో రూ.50 వేలు చక్రధరరావుకు ఇచ్చాడు. ఆ డబ్బుల్లో దళారీగా చక్రధరరావు రూ.1000 ఉంచుకుని, రూ.49 వేలను సాకేటి లక్ష్మణకు ఇచ్చాడు. దీనికి అంగీకరించని లక్ష్మణరావు చక్రధరరావుతో గొడవపడ్డాడు. ఇంతలో అలమండ సంత ప్రాంతానికి చెందిన జన్నెల ఈశ్వరరావు కలుగజేసుకుని, ఎప్పుడూ దళారీలకు ఇవ్వాల్సిన డబ్బులు ఇచ్చేందుకు ఇబ్బంది పెడతావు ఎందుకని లక్ష్మణరావుతో గొడవపడ్డాడు. మండల రామినాయుడుతో పాటు కందుకూరి సత్యనారాయణ, గంట్రేటి చక్రధర్, కెంబూరు అప్పలనాయుడు గొడవను విడిపించే ప్రయత్నం చేశారు. నన్నే తోస్తావా అంటూ రామినాయుడిపై ఈశ్వరరావు దాడికి పాల్పడ్డాడు. ఇది గమనించిన ఈశ్వరరావు కొడుకు కిశోర్ కూడా రామినాయుడు గుండెలపై పిడుగుద్దులు గుద్దడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకుని, భోరున విలపించారు. మృతుడి బావ పప్పల శ్రీహరినాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు(100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24కి. 10గ్రా.)	59,160-00
బంగారం(22కి. 10గ్రా.)	54,250-00
వెండి (కిలో)	76,700-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ Paramedical B.Sc. Anesthesia, Forensic Sci., Cardiac, Radiology, MLT, O.T. Tech, Emergency, BPT, MPT, Eligible : Inter Bi.Pc / MPC. (C) Chaitanya University, Hyderabad. 72079 98395, 90590 43395 [V- 1994]

WANTED

■ IRPM కంపెనీ SKLM, VZM మండలాల్లో నూతనంగా ప్రారంభించిన బ్రాంచ్‌లో BMMT లో చేయుటకు,10th ఇంటర్ 50 మంది యువతీ యువకులు కావలెను. Income 12000-22000/-. 9849553548 [WA-6996]

■ Job Vacancy. TIK PVT LTD. Age:18 to 45 Yrs, Qul: 10th to Any Degree, Salary: 18,000 to 25,000/- Contact Cell: 7702553782. [T-1708]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12000-35000/-, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. ఫోన్ : 8919613984. [HA-366]

FACULTY TEACHER

■ We need Lady Faculty for classes Nursery, L.K.G, U.K.G, Qul: Degree (English must), Sal: negotiable (6000/-), Pradeep Nagar, VZM. Cont: 9866240948. [C-1216571]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.